సాక్షి కామారెడ్డి

శనివారం । 1 । జూన్ । 2024



హడలెత్తిస్తున్న చోరీలు

ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలతో రైతులు హడలెత్తుతున్నారు. 15 రోజుల్లో పది ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాయిల్స్ ఎత్తుకెళ్లారు.

- 10లో ▸



నకిలీవి అమ్మితే చర్యలు

ఫర్టిలైజర్ దుకాణాల్లో అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

- 11లో ▸

గరిష్టం/కనిష్టం
44.8 /28.9

వాతావరణం

ఉదయంనుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ముగిసిన సప్లిమెంటరీ పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ముగిశాయి. శుక్రవారం ఉదయం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 3,653 మందికిగాను 3,269 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఐదుగురు ఖాళీ ఓఎంఆర్ బార్ కోడ్ షీట్స్ ఇచ్చారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 1,990 మందికిగాను 1,892 మంది హాజరయ్యారు. ఇద్దరు విద్యార్థులు ఖాళీ ఓఎంఆర్ బార్‌కోడ్ షీట్స్ ఇచ్చారని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు.

జిల్లాలో 30, 30ఏ పోలీస్ యాక్ట్ అమలు

కామారెడ్డి క్రైం: జిల్లాలో ఈనెల 7వ తేదీ వరకు 30, 30ఏ పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ సింధుశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు, నిరసనలు, ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళన కార్యక్రమాలు చేపట్టరాదని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, పోలీసులకు సహకరించాలని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ



బిచ్కుంద: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ట్రెయినీ ఎస్పీ కాజల్ శుక్రవారం తనిఖీ చేశారు. ఎస్సై మోహన్‌రెడ్డితో మాట్లాడి క్రైం రేటు, పెట్రోలింగ్ తదితర వివరాలు తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: బెస్ట్ అవైలబుల్ పథకం కింద వివిధ తరగతుల్లో ప్రవేశం కోసం ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి గన్నవరం రజిత ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తరగతి (డే స్కాలర్), 5వ తరగతి (రెసిడెన్షియల్)లలో ప్రవేశాలకోసం ఆసక్తిగల విద్యార్థులు 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 83280 15942 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

‘334 కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తి’

కామారెడ్డి క్రైం: జిల్లాలో 334 కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తయ్యిందని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16 కేంద్రాలలో ఉన్న కొద్దిపాటి ధాన్యాన్ని మిల్లులకు తరలించే ప్రక్రియ వేగవంతంగా సాగుతోందని పేర్కొన్నారు. తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లు, మిల్లర్లు, కేంద్రాల నిర్వాహకులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు 54,150 మంది రైతుల నుంచి రూ.687 కోట్ల విలువైన 3,11,592 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. రైతుల ఖాతాల్లో రూ.638 కోట్లు జమ చేశామని, రెండు రోజుల్లోగా మిగతా రైతులకు డబ్బులు జమయ్యేలా చూస్తామని పేర్కొన్నారు.

తారెత్తిస్తున్న ఎండ

కామారెడ్డి టౌన్ : సూరీడు ఉగ్రరూపం దాలుస్తున్నాడు. ప్రచండ కిరణాలతో తారెత్తిస్తున్నాడు. రోజురోజుకు గరిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో జనం అల్లాడుతున్నారు. జిల్లాలో శుక్రవారం బాన్సువాడ మండలం కొల్లూర్‌లో అత్యధికంగా 44.8 ఉష్ణోగ్రత నమోదైంది. అత్యల్పంగా పెద్దకొడప్‌గల్‌లో 39.6 ఉష్ణోగ్రత రికార్డయ్యింది. బిచ్కుందలో 43.9, భిక్కనూరు, డోంగ్లిలో 43.8, రామారెడ్డిలో 43.3, నస్రుల్లాబాద్‌లో 42.9, ఎల్లుకొండలో 42.8, జుక్కల్, గాంధారిలలో 42.7, పిట్లంలో 42.6, పాతరాజంపేట్‌లో 42.3 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. మిగతా ప్రాంతాలలో 40 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. దీంతో ప్రజలు పగటి పూట బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు.

ఎస్సారెస్పీ ఎస్‌ఈగా శ్రీనివాస్ గుప్తా

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్‌గా శ్రీనివాస్ గుప్తాను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులను జారీ చేసింది. ఇది వరకు ఎస్‌ఈగా విధులు నిర్వర్తించిన శ్రీనివాస్ శుక్రవారం పదవీవిరమణ పొందారు. దీంతో జగిత్యాల్ ఇరిగేషన్ సర్కిల్‌లోని డివిజన్-5 ఈఈ శ్రీనివాస్ గుప్తా నియమితులయ్యారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

ప్రత్యేక పోరులో జిల్లా పుటలు

- తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదిన కామారెడ్డి జిల్లా
- రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరు
- ఉద్యమంలో భాగమైన సబ్బండవర్ణాలు
- ఎన్నికలలో బీఆర్‌ఎస్‌ను ఆదరించిన ఓటర్లు
- జిల్లాపరిషత్‌పై ఎగిరిన గులాబీ జెండా
- త్యాగాలతో సిద్ధించిన రాష్ట్రం
- రేపటినుంచి దశాబ్ది ఉత్సవాలు

మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్షను నెరవేర్చుకోవడం కోసం ఈ ప్రాంత ప్రజలు ఎంతో మంది ప్రాణాలకు తెగించి పోరాడారు. ఎన్నో పోరాటాలు, ఎంతోమంది త్యాగాలతో తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది. ప్రజల ఆకాంక్ష నెరవేరి దశాబ్దం కావస్తోంది. ఈ సందర్భంగా ఆనాటి పోరాటాలను, ఉద్యమకారుల త్యాగాలను జనం గుర్తుచేసుకుంటున్నారు.



కామారెడ్డిలో నిర్వహించిన రైల్‌రోకోలో పాల్గొన్న వేలాది మంది ప్రజలు (ఫైల్)

సాక్షి, కామారెడ్డి : తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా క్రియాశీలక పాత్ర పోషించింది. 1969 ఉద్యమంలో ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు కొనసాగాయి. అప్పుడు విద్యార్థులే ఉద్యమానికి నాయకత్వం వహించి పోరాటం చేశారు. 1990 వ దశకంలో వామపక్ష భావజాలం ఉన్న మేధావులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, అధ్యాపకులు, ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలు తెలంగాణ జనసభ, తెలంగాణ ఐక్యవేదిక వంటి సంస్థల ద్వారా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటాల్లో పాల్గొన్నారు. అప్పటి ప్రభుత్వం తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నవారిని అనేక ఇబ్బందులకు గురిచేసింది. ఎందరినో కేసుల్లో ఇరికించింది. ఎంతో మందిని ఎన్‌కౌంటర్లలో హతమార్చింది.

మలి దశ ఉద్యమం..

2001లో తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావంతో మలిదశ ఉద్యమం ఊపందుకుంది. తెలంగాణ రాష్ట్రం కోసం కామారెడ్డి బార్ అసోసియేషన్ తీర్మానం చేసి, ఉద్యమంలో భాగమైంది. సమైక్య రాష్ట్రంలో వివక్ష, అణచివేతలకు గురయ్యామంటూ సబ్బండ వర్ణాలు ఉద్యమంలో భాగమయ్యాయి. టీఆర్‌ఎస్ ఆవిర్భవించిన తొలినాళ్లలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను బలంగా చాటారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో చాలాచోట్ల టీఆర్‌ఎస్‌కు చెందినవారిని ఎంపీటీసీలుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మెజారిటీ జెడ్పీటీసీ స్థానాలను గెలుచుకోవడం ద్వారా జిల్లా పరిషత్ పీఠంపై తొలిసారి గులాబీ జెండా ఎగిరింది. అటు ఉద్యమాలు, ఇటు ఎన్నికల ద్వారా తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమం కొనసాగింది. తెలంగాణ రాజకీయ జేఏసీ గొడుగు కింద ఉద్యమకారులంతా రాజీలేని పోరాటాలు సాగించారు.

రాజీనామాలు, ఉప ఎన్నికలు..

2004 అసెంబ్లీ ఎన్నికలలో టీఆర్‌ఎస్, కాంగ్రెస్ పొత్తుపెట్టుకున్నాయి. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో టీఆర్‌ఎస్ గెలిచింది. అయితే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో కాంగ్రెస్ వెనకడుగు వేయడంతో టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు 2008లో పదవులకు రాజీనామా చేశారు. ఉప ఎన్నికలలో టీఆర్‌ఎస్ ఓడిపోయింది. కాగా 2009లో టీడీపీతో పొత్తు పెట్టుకుని టీఆర్‌ఎస్ ఎన్నికల బరిలో నిలిచి ఎల్లారెడ్డిలో గెలిచింది. ప్రజలు తెలంగాణ ఉద్యమాల్లో పాల్గొనడంతో రాజకీయ పార్టీలకు చెందిన నేతలు వారితో కలిసి పాల్గొనాల్సి వచ్చింది. ఉద్యమానికి మద్దతుగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ టీడీపీని, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి టీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం జరిగిన ఉప ఎన్నికలలో తిరిగి వారినే ప్రజలు గెలిపించారు. అనంతరం జుక్కల్ ఎమ్మెల్యేగా ఉన్న హన్మంత్ సింధే సైతం టీడీపీని వీడి టీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.

కానిస్టేబుల్ కిష్టయ్య బలిదానంతో..

2009 నవంబర్ 29న కేసీఆర్ ఆమరణ దీక్ష మొదలుపెట్టడంతో జిల్లాలో తెలంగాణ ఉద్యమం ఉగ్రరూపం దాల్చింది. కేసీఆర్‌ను పోలీసులు అరెస్టు చేయడంతో కామారెడ్డి జిల్లా కేంద్రంలో పోలీస్ కానిస్టేబుల్ కిష్టయ్య తుపాకీతో కాల్చుకుని ఆత్మబలిదానం చేశారు. దీంతో జిల్లాలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమం మరింత ఉధృతమైంది. తెలంగాణ రాజకీయ జేఏసీ ఆధ్వర్యంలో సాగిన సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్ వంటి ఎన్నో ఉద్యమాల్లో కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల ప్రజలు పాల్గొన్నారు. కామారెడ్డిలో జేఏసీ కన్వీనర్ జి.జగన్నాథం, కోకన్వీనర్ తిర్మల్‌రెడ్డి, క్యాతం సిద్దరాములు, డాక్టర్ వి.శంకర్ తదితరుల నాయకత్వంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు కొనసాగాయి. నిరసనల్లో పాల్గొన్న వందలాది మంది జైళ్లపాలయ్యారు. అయితే ఉద్యమం తీవ్రతరం కావడంతో డిసెంబర్ 9న అప్పటి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ మొదలైందని ప్రకటించింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు వ్యతిరేకంగా సీమాంధ్రలో ఉద్యమం మొదలవడంతో రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ అప్పుడు ఆగిపోయింది. దీంతో మళ్లీ ఉద్యమం ఉగ్రరూపం దాల్చింది.

నెరవేరిన ప్రజల ఆకాంక్ష

2011లో జరిగిన సకల జనుల సమ్మెలో కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జాతీయ రహదారుల దిగ్బంధం, రైల్‌రోకోల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన రైల్‌రోకోలో వేలాది మంది మహిళలు పట్టాలపై కూర్చుని రైళ్లను కదలకుండా కట్టడి చేసి, సంచలనం సృష్టించారు. ప్రజల ఉద్యమాల ఫలితంగా 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. ప్రజల ఆకాంక్ష నెరవేరింది.

నిరాడంబరంగా రాష్ట్ర అవతరణ వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: ఈనెల 2వ తేదీన రాష్ట్ర అవతరణ వేడుకలను నిరాడంబరంగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. ఆయా శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రభుత్వ సూచనల మేరకు వేడుకలను నిరాడంబరంగా నిర్వహించాలన్నారు. గ్రామ స్థాయి నుంచి ప్రతి ఒక్కరిని వేడుకల్లో భాగస్వాములను చేయాలని, సర్పంచుల పదవీకాలం ముగిసినందున గ్రామాల్లో ప్రత్యేకాధికారులు పతాకావిష్కరణ చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు పాల్గొనే కార్యక్రమాల్లో ఎలాంటి రాజకీయ ప్రసంగాలు లేకుండా చూడాలన్నారు. కలెక్టరేట్ మినహా జిల్లా అంతటా ఉదయం 9 గంటల లోగా పతాకావిష్కరణ జరగాలని సూచించారు. కామారెడ్డి పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద ఉదయం 8.30 గంటలకు అమరవీరులకు శ్రద్ధాంజలి, 9 గంటలకు కలెక్టరేట్ ఆవరణలో జాతీయ పతాకావిష్కరణ, పోలీసు గౌరవవందనం, ప్రసంగం ఉంటాయని తెలిపారు. అవార్డుల ప్రదానం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉండవన్నారు. సమావేశంలో ఆర్డీవో రంగనాథరావు, డీఎస్పీ యాకుబ్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, అధికారులు దయానంద్, వరదారెడ్డి, భాగ్యలక్ష్మి, కోటేశ్వర్లు, రాజు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కొరత లేదు

- కలెక్టర్ జితేష్ వి పాటిల్
- భిక్కనూరు సింగిల్ విండో తనిఖీ




విత్తనాల దుకాణంలో రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

భిక్కనూరు: జిల్లాలో విత్తనాల కొరత లేదని, రైతాంగానికి అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మండల కేంద్రంలోని సింగిల్ విండోను కలెక్టర్ శుక్రవారం సందర్శించి జీలుగ, పెద్ద జనుము విత్తన విక్రయాలను పరిశీలించారు. రైతువేదికను సందర్శించి గ్రామాల వారీగా పూర్తయిన విత్తన విక్రయాల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం విత్తన, పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీలర్లు తప్పనిసరిగా తాము విక్రయించిన ప్రతి ఎరువు, విత్తన బస్తాకు, పురుగుమందులకు రసీదు ఇవ్వాలని, పత్తి విత్తనాలు కొనుగోలు చేసిన రైతుల జాబితాను తయారుచేయాలని సూచించారు. నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రతిరోజూ విత్తన విక్రయాలను పర్యవేక్షించాలని, నకిలీ విత్తనాల బారినపడకుండా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. ఆయన వెంట జేడీఏ భాగ్యలక్ష్మి, ఏవో రాధారెడ్డి, ఏఈవో వినోద్, ఆనంద్ తదితరులు ఉన్నారు.

అమ్మో.. జూన్

- బడిబాట, పొలం బాటలో అప్పుల వేట!
- సేద్యానికి, చదువులకూ ఒకేసారి ఖర్చులు
- భారంగా మారిన పంట పెట్టుబడులు, స్కూల్ ఫీజులు
- సామాన్యుడికి జూన్ గుబులు



సాక్షి, కామారెడ్డి: పిల్లలు బడి బాట.. తల్లిదండ్రులు పొలంబాట పట్టే సమయం ఆసన్నమైంది. వానాకాలం పంటల సాగుకు రైతులు ఈనెలలోనే సన్నద్ధమవుతుండగా, కొత్త విద్యాసంవత్సరం సైతం షురూ కానుంది. దీంతో అందరిలోనూ ‘జూన్ గుబులు’ ప్రారంభమైంది. వ్యవసాయంలో పెట్టుబడులు ఎంత అవసరమో, పిల్లల చదువులకూ అంతకన్నా ఎక్కువే అవసరమవుతోంది. రెండింటికీ ఒకే సమయంలో ఖర్చు చేయాల్సిన పరిస్థితుల్లో సామాన్యుడు ఇబ్బంది పడుతున్నాడు. ఇదే సమయంలో వ్యవసాయంలో పెట్టుబడులు పెరగడం, చదువులకు సంబంధించిన ఫీజులు, ఇతర ఖర్చులు కూడా పెరిగి జూన్ నెల ఎలా గట్టెక్కేదని ఆవేదన చెందుతున్నారు. ప్రతి ఏడాది ఇదే పరిస్థితి ఎదురవుతోంది. వ్యవసాయంలో ఏడాదికేడాది పెట్టుబడులు పెరగడం, తెగుళ్లు, వడగళ్ల వానలతో దిగుబడులు తగ్గిపోయి చిన్న, సన్నకారు రైతులకు పెద్దగా మిగులుబాటు ఉండకపోగా, రెక్కల కష్టం కూడా దక్కడం లేదు. దీంతో వచ్చే సీజన్‌లో పెట్టుబడులకు అప్పులు చేయాల్సిందే. పంటలసాగుకు, పిల్లల చదువుకు అప్పులు చేయాల్సిన పరిస్థితుల్లో సామాన్యుడు ఇబ్బందిపడుతున్నాడు.

అప్పులు చేయాల్సిందే..

ఏటా జూన్ నెలలో పంటల సాగు, పిల్లల చదువుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఏకకాలంలో రెండు రకాల ఖర్చులు భారంగా మారాయి. అవసరమైన సమయంలో బ్యాంకుల్లో రుణాలు లభించని పరిస్థితుల్లో వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేస్తున్నారు. ఎక్కువ వడ్డీలు కూడా పేద, మధ్య తరగతి వర్గాలకు ఇబ్బందికరంగా తయారవుతోంది. ఏది ఏమైనా జూన్ నెల గట్టెక్కడం సామాన్యుడికి సవాల్ అనే చెప్పాలి!

పెరిగిన పంట సాగు ఖర్చులు

జిల్లాలో మెజారిటీ ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. 3 లక్షల మందికిపైగా రైతులు పంటలు సాగు చేస్తున్నారు. గతంలో ఎడ్ల నాగళ్లతో దుక్కిదున్నేవారు. ప్రస్తుతం 90శాతానికి పైగా రైతులు దుక్కిదున్నేందుకు ట్రాక్టర్లనే వినియోగిస్తున్నారు. దీంతో దుక్కిదున్నడం నుంచి విత్తనం వేసే వరకు ఖర్చు రెట్టింపు అవుతోంది. విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు పెట్టుబడులు అవసరమవుతాయి. ప్రభుత్వం పెట్టుబడి కోసం రైతుబంధు ద్వారా ఎకరాకు పంటకు రూ.5 వేలు అందిస్తున్నా, అవి ఏమాత్రం సరిపోవడం లేదు. ఏ పంట వేయాలన్నా తొలినాళ్లలోనే పెట్టుబడులు ఎకరాకు తక్కువలో తక్కువ రూ.20 వేలు ఖర్చు చేయాల్సిందే. ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం ఏమూలకు సరిపోదు. దీంతో పెట్టుబడుల కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు.

చదువులకు ఖర్చు ఎక్కువే

జిల్లాలోని 1014 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 90 వేల మంది, గురుకుల పాఠశాలల్లో 10 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. అలాగే జిల్లాలోని 166 ప్రైవేటు పాఠశాలల్లో 50 వేల పైచీలుకు విద్యార్థులు ఉండగా, ఇతర ప్రాంతాల్లోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో మరో ఇరవై వేల మంది వరకు చదువుతున్నట్లు అంచనా. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందిస్తున్నప్పటికీ నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, బ్యాగులు కొనుక్కోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు తొంభై శాతం మంది పేద విద్యార్థులే చదువుతారు. ప్రైవేటు బడుల్లో చదివే విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు, బ్యాగులు, షూస్ కోసం తక్కువలో తక్కువ రూ.10 వేల వరకు ఖర్చు చేయాల్సిందే. ఏడాదికి తక్కువలో తక్కువ రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు ఫీజుల కోసం వెచ్చించాల్సిన పరిస్థితి. ఇద్దరు పిల్లలు ఉంటే వాళ్లకు అయ్యే ఖర్చు రూ.50 వేలపైనే ఉంటుంది. ఇదిలా ఉండగా ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ తదితర ఉన్నత విద్యకోసం లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది.

‘కామారెడ్డి’ వైస్ చైర్‌పర్సన్‌గా వనిత



వైస్ చైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న వనిత



కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిల్ సభ్యులు

- ఏకగ్రీవంగా ఎన్నుకున్న బల్దియా సభ్యులు
- ప్రమాణ స్వీకారం చేయించిన ఆర్డీవో

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా పదో వార్డు కౌన్సిలర్ ఉర్దొండ వనిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతనెల 15న వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన విషయం తెలిసిందే. దీంతో వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక కోసం శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆర్డీవో రంగనాథ్ ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియ సాగింది. బల్దియాలో 49 మంది సభ్యులుండగా.. సమావేశానికి 30 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన సీల్డ్ కవర్‌ను ఓపెన్ చేయగా.. అందులో వైస్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా ఉర్దొండ వనిత పేరు ఉంది. ఇతర పార్టీలనుంచి పోటీలో ఎవరూ లేకపోవడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్డీవో ప్రకటించారు. ఆమెకు ఎన్నిక పత్రాన్ని అందించిన అనంతరం ఆర్డీవో ప్రమాణ స్వీకారం చేయించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, చైర్‌పర్సన్ ఇందుప్రియ, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఎన్నిక ప్రక్రియ పూర్తయిన అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ నాయకులు టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

భిక్కనూరు: రైతు సంక్షేమమే డీసీసీబీ ధ్యేయమని ఆ సంస్థ జిల్లా చైర్మన్ రమేశ్‌రెడ్డి అన్నారు. మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను తక్కువ ధరలకు అందించడంతోపాటు పంటదిగుబడులను డీసీసీబీ సహకారంతో సింగిల్‌విండోలు కొనుగోలు చేస్తున్నాయన్నారు. ప్రతి రైతు ఆర్థికంగా ఎదిగేందుకు డీసీసీబీ ఎంతగానో సహకరిస్తుందన్నారు. గడిచిన పదేళ్లలో అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతాంగానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్కరూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. కామారెడ్డి నియోజకవర్గంలో అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతుల బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ చొరవతో ప్రభుత్వం నష్టపరిహారాన్ని జమ చేసిందన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్, జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్ రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి, నేతలు నయీం, కిష్టాగౌడ్, గోనె శ్రీనివాస్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉర్దూ అకాడమీలో టీచర్ల కొరత తీర్చాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హుందాన్‌ను లింగంపేట మండల మైనార్టీ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఉర్దూ అకాడమిలో టీచర్ల కొరత ఎక్కువగా ఉండడంతో వెంటనే పోస్టులు భర్తీ చేయాలని కోరారు. చైర్మన్‌ను కలిసిన వారిలో మైనారిటీ నాయకులు మోహిద్, ఆరిఫ్, కలీం, శౌకత్అలీ తదితరులు ఉన్నారు.

నిరుపయోగంగా తాగు నీటి తొట్టెలు



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని లక్షలు వెచ్చించి నిర్మించిన నీటి తొట్టెలు నిరుపయోగంగా ఉన్నాయి. పశువులు నీరుతాగడానికి ఉపయోగకరంగా ఉండాలని ఏర్పాటు చేసిన నీటి తొట్టెలు శిథిలావస్థకు చేరాయి. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి పశువుల కోసం నీటి తొట్టెలను సంబంధిత అధికారులు ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

సూపరింటెండెంట్ సేవలు మరవలేనివి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించిన రవీందర్ సేవలు మరవలేనివని ఎంపీపీ మాధవి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మాట్లాడారు. ఆకాక్షించారు. అనంతరం రవీందర్ దంపతులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మి, ఎంపీవో ప్రకాష్, జెడ్పీటీసీ ఉషాగౌడ్ తదితరులున్నారు.

'అంకిత భావంతో పనిచేస్తేనే ప్రజల్లో గుర్తింపు'



కామారెడ్డిఅర్బన్: అంకితభావం, నిజాయితీగా విధులు నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగులే ప్రజల్లో గుర్తింపు పొందుతారని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి అన్నారు. బీసీ సంక్షేమ శాఖ జిల్లా సహాయ అధికారి యాదగిరి ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశం శుక్రవారం సాయంత్రం యాదగిరి దంపతులను ఘనంగా సన్మానించారు. జిల్లా అధికారులు రాజారామ్, వరదారెడ్డి, దయానంద్, సంక్షేమాధికారులు నాగరాజు ఉన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

బీబీపేట: అదనపు కట్నం కోసం మహిళను భర్త, అత్త మామలు వేధిస్తున్న ఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన సౌజన్యను సదాశివనగర్‌కు చెందిన సుతారి నవీన్‌కు ఇచ్చి 2020లో పెళ్లి చేశారు. కొన్ని రోజులుగా అదనపు కట్నం, బంగారం తేవాలని ప్రతిరోజు వేధిస్తున్నారని, పెద్దల సమక్షంలో చాలా సార్లు నచ్చజెప్పినప్పటికీ వినడం లేదని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతే కాకుండా అత్త రాజమణి, మామ సుధాకర్ సైతం విపరీతంగా బంగారం తెమ్మని హింసిస్తున్నారని, వారి నుంచి సౌజన్య రక్షణ కోరినట్లు ఎస్సై తెలిపారు.

హడలెత్తిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు

- పక్షం రోజులలో పది ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి కాయిల్స్ చోరీ చేసిన దొంగలు
- ఆందోళన చెందుతున్న రైతులు



లింగంపల్లి కలాన్, తాండూర్ శివారులో దొంగలు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి కాపర్ కాయిల్స్ చోరీలు ఎక్కువయ్యాయి. జనాలు లేని నిర్మానుష్య ప్రాంతాలను, ప్రధాన రహదారుల వెంట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లను ఎంచుకుని చోరీలకు పాల్పడుతున్నారు. దీంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. పలు మండలాల పరిధిలో పక్షం రోజులలో పది ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి కాపర్ కాయిల్స్‌తో పాటు ఆయిల్‌ను చోరి చేశారు. దీంతో ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి రూ.30 వేల నుంచి రూ.60 వేల వరకు నష్టం వాటిల్లింది. దొంగలు నాగిరెడ్డిపేట మండలంలోని లింగంపల్లికలాన్, ధర్మారెడ్డి, వెంకంపల్లి, ఎర్రారం, రాఘవపల్లి, గోపాల్‌పేట్, తాండూర్, ఎల్లారెడ్డి మండలంలోని మాచాపూర్, అడివిలింగాల గ్రామశివారులో పంట పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఆయిల్, కాపర్ కాయిల్స్ చోరీ చేశారు.

కాపర్ కాయిల్స్, ఆయిల్‌కు భారీ రేటు..

ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉండే కాపర్ కాయిల్స్, ఆయిల్ రేటు బాగా ధర ఉండడంతో దొంగలు దీని వెంట పడుతున్నారని రైతులు అంటున్నారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌లో రూ.30 వేల విలువ చేసే కాపర్ కాయిల్స్‌తో పాటు, 200 లీటర్ల వరకు ఆయిల్ ఉండడం ఇది లీటర్ రూ.200 వరకు ఉండడంతో దీని వెంట పడుతున్నారని అంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి ఆయిల్, కాయిల్స్ చోరీ కాకుండా అధికారులు చర్యలను తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి

అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి ఆయిల్, కాయిల్స్ చోరీ కాకుండా చర్యలు తీసుకోవాలి. దీని వల్ల రూ.30 వేల నుంచి 60 వేల వరకు నష్టం వాటిల్లుతోంది. దీంతో పాటు నెలల తరబడి ట్రాన్స్‌ఫార్మర్ లేక రైతులు ఇబ్బందుల పాలు కావాల్సి వస్తున్నది.

– సాయిలు, రైతు, లింగంపల్లికలాన్, నాగిరెడ్డిపేట

ట్రాన్స్‌ఫార్మర్ ఓపెన్ కాకుండా చూడాలి

ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి ఆయిల్, కాయిల్ చోరి కాకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలి. ట్రాన్స్‌ఫార్మర్ ఓపెన్ కాకుండా కొత్త విధానాన్ని ఏర్పాటు చేయాలి. అలా అయితేనే చోరీని నివారించగలం.

– పోచయ్య, మాచాపూర్, ఎల్లారెడ్డి మండలం

యాంటీ థెఫ్ట్ బోల్ట్‌లను ఏర్పాటు చేస్తున్నాం

జిల్లాలో పదిహను రోజులలో ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఆయిల్, కాపర్ కాయిల్స్ చోరీకి గురయ్యాయి. చోరీని నివారించేందుకు యాంటీ థెఫ్ట్ నట్ బోల్టులను తెప్పించాం. రోడ్డు పక్కన ఉన్న వాటికి యాంటీ థెఫ్ట్ బోల్టులను బిగించడంతో పాటు జిల్లా కేంద్రం నుంచి పంపించే ప్రతి ట్రాన్స్‌ఫార్మర్‌కు యాంటీ థెఫ్ట్ బోల్టులను బిగించి పంపిస్తున్నాం. ట్రాన్స్‌ఫార్మర్‌లలో కాపర్ కాయిల్స్ చోరీకి గురి కాకుండా అల్యూమినియం కాయిల్స్‌ను వినియోగిస్తున్నాం. ఎస్పీకి కూడా ఫిర్యాదు చేశాం.

– రమేష్‌బాబు, ఎస్ఈ, ట్రాన్స్‌కో, కామారెడ్డి

ప్రపంచ పొగాకు వ్యతిరేక ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

కామారెడ్డి టౌన్: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పొగాకు నిర్మూలనకు వైద్యారోగ్యశాఖ కృషి చేస్తుందన్నారు. ఇటీవల ప్రభుత్వం పొగాకు ఉత్పత్తులు, పాన్, గుట్కా అమ్మకాలను నిషేధించిన నేపథ్యంలో పోలీసుశాఖతో కలిసి పనిచేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేయాలన్నారు. అనంతరం ఆరోగ్య సిబ్బందితో పొగాకు వ్యతిరేక దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శిరీష, ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శోభారాణి, వైద్యులు సాయిఈశ్వరి, చందన ప్రియ, సోషల్ వర్కర్ రాహుల్‌కుమార్, పర్యవేక్షణ అధికారి రమణ, సుభాషిణి,సూపర్‌వైజర్ రమణ, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

భౌతికం టు గణితం..

- భౌతిక శాస్త్రం బోధించే టీచర్లు గణిత బోధన చేయాలని ఉత్తర్వులు
- వ్యతిరేకిస్తున్న టీచర్లు

నిజామాబాద్అర్బన్: గణిత శాస్త్రం సబ్జెక్టును భౌతిక శాస్త్రం ఉపాధ్యాయులు బోధించాలని ఇటీవల ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోని 6, 7 తరగతులకు గణితాన్ని భౌతిక శాస్త్రం ఉపాధ్యాయులు బోధించాలని పేర్కొనడంతో ఉపాధ్యాయ సంఘం నాయకులు, భౌతిక శాస్త్రం ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. తెలంగాణ విద్యాశాఖ భౌతిక, రసాయనం శాస్త్రం పట్ల చిన్నచూపు చూడడం భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు గణిత బోధనకు పరిమితం చేయడం చాలా దురదృష్టకరమని సంబంధిత సబ్జెక్టు టీచర్లు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే విద్యాశాఖ కార్యదర్శి విడుదల చేసిన 1143 మెమోను వెంటనే సవరించాలని కోరుతున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 20 శాతం గణిత ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్నప్పటికీ గణిత శాస్త్రం చెప్పే ఉపాధ్యాయులకు గణితాలు ఇవ్వకుండా భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు బలవంతంగా బోధించాలని చెప్పడం సమంజసం కాదని విమర్శలు వస్తున్నాయి. వారానికి ఐదు తరగతుల చొప్పున పాఠ్యాంశాలు బోధించాలంటే చాలా కష్టమని సంబంధిత టీచర్లు పేర్కొంటున్నారు. తెలంగాణలో 60 శాతం పైచిలుకు ప్రధానోపాధ్యాయులు గణిత బోధన చేసిన వారి ప్రాథమిక నిబంధన ప్రకారం ప్రధానోపాధ్యాయులు వారానికి 8 తరగతులు తీసుకోవాల్సి ఉంటుంది. అయినా ప్రధానోపాధ్యాయులకు కూడా ఆరవ తరగతి ఏడవ తరగతి కేటాయించకుండా బలవంతంగా భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయులు చెప్పించాలని ఇచ్చిన ఉత్తర్వులు ఏమాత్రం సమంజసం కాదని పేర్కొంటున్నారు.

గణిత ఉపాధ్యాయులకు 8, 9, 10 తరగతులకు మాత్రమే బోధించమని పక్షపాత వైఖరి రాష్ట్ర విద్యాశాఖ యోచించడం సరైంది కాదని పేర్కొంటున్నారు. నేటి పరిస్థితులలో గణిత శాస్త్రం కంటే అత్యంత ప్రాముఖ్యమైన సబ్జెక్టు భౌతిక, రసాయన శాస్త్రం. ఉపాధ్యాయులు ఎంత చెప్పినా తక్కువగానే ఉంటుంది.

సేంద్రియ ఎరువులతో దిగుబడులు



సేంద్రియ ఎరువును విక్రయిస్తున్న ఎంపీడీవో

భిక్కనూరు : సేంద్రియ ఎరువుతో వ్యవసాయరంగంలో అధిక దిగుబడులు సాధించవచ్చని ఎంపీడీవో ప్రవీన్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన భి క్కనూరు మండలం అంతంపల్లి, లక్ష్మీదేవునిపల్లి గ్రామాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల్లో జరగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి డంపు యార్డుల వద్ద త యారు చేసిన సేంద్రియ ఎరువులను విక్రయించా రు. ఈ కార్యక్రమంలో నేతలు సంజీవరెడ్డి ఎంపీటీ సీ సభ్యురాలు మంజుల తదితరులు పాల్గొన్నారు.

మహిళతో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి అసభ్య ప్రవర్తన

- దేహశుద్ధి చేసిన స్థానికులు

రామారెడ్డి: రామారెడ్డి గ్రా మానికి చెందిన ఓ మహి ళతో అసభ్యకరంగా ప్రవర్తించిన రామారెడ్డి మండల యూత్ కాంగ్రెస్ అ ధ్యక్షుడు వడ్ల ఆనంద్‌పై పోలీసులు గురువారం రా త్రి కేసు నమోదు చేశారు. ఓ మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఆనంద్‌ను ఆ మహిళ ప్రతిఘటించడంతో చుట్టుపక్కల వారు పట్టుకొని చితకబాది పోలీస్ స్టేషన్లో అప్పగించారు. రామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఆనంద్‌పై బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. ఆనంద్‌కు సంబంధించిన అంశాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, మహిళకు అండగా నిలుస్తామని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన వడ్ల ఆనంద్‌ను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరిగినా అధికారికంగా సస్పెండ్‌కు సంబంధించిన ఎలాంటి ప్రకటనా వెలువడలేదు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం టిప్పర్ ఢీకొని ఉమ్మడ ఆశన్న(65) అనే వృద్ధుడు మృతిచెందాడు. వివరాలు.. ఉమ్మడ ఆశన్న తన తోట నుంచి సైకిల్‌పై ఇంటికి వెళ్తున్న సమయంలో అదే రోడ్డులో వస్తున్న టిప్పర్ వెనుక వైపు తగిలి టైర్ కింద పడిపోయాడు. దీంతో ఆశన్న అక్కడిక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

ఆగి ఉన్న లారీ ఢీకొని మరొకరు..


ఆర్మూర్‌టౌన్: చేపూర్ సమీపంలో 63వ నెంబర్ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొన్న ఘటనలో పల్లపు నర్సయ్య(63) అనే వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మోర్తాడ్ మండలం శెట్‌పల్లి గ్రామానికి చెందిన నర్సయ్య పెర్కిట్‌లో సమీప బంధువుల అంత్యక్రియలకు హాజరయ్యాడు. అనంతరం తిరుగు ప్రయాణంలో తన బంధువుకు చెందిన ఒకరి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఆగి ఉన్న లారీని వెనుక వైపు ఢీకొట్టాడు. ఈ ఘటనలో నర్సయ్య తీవ్ర గాయాలతో అక్కడిక్కడే మృతిచెందగా వాహనం నడుపుతున్న నగేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడు..

ఆర్మూర్‌టౌన్: పెర్కిట్ శివారులో 44వ నెంబరు జాతీయ రహదారిపై గురువారం రాత్రి ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని పడిగెల రణవీర్(36) అనే యువకుడు మృతి చెందాడు. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన రణవీర్ నిజామాబాద్‌లోని ఒక ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. పనులు ముగించుకుని బైక్‌పై నిర్మల్ వెళ్తుండగా రహదారిపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన రణవీర్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. భార్య హారిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

- ముగ్గురికి గాయాలు



మార్క వినయ్

మోర్తాడ్(బాల్కొండ): దొన్కల్ క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన మార్క వినయ్(16) అనే బాలుడు మరణించగా.. బైక్‌పై ఉన్న మరో యువకుడు కోరవెల్లి శివకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉంది. వినయ్ తన పుట్టిన రోజు వేడుకలు నిజామాబాద్‌లో గురువారం చేసుకుని శుక్రవారం తెల్లవారుజామున బైక్‌పై మోర్తాడ్ వస్తుండగా.. ట్రాన్స్‌పోర్ట్ వాహనం ఆర్మూర్ నుంచి మంచిర్యాల్ వైపు వెళుతుంది. వాహనం డ్రైవర్ అజాగ్రత్తతో పాటు అతి వేగంగా వాహనం నడపడటంతో బైక్‌ను ఢీకొని వాహనం రోడ్డు ప్రక్కన పడిపోయింది. డ్రైవర్, క్లీనర్‌లకు కూడా గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో మొదట నలుగురు గాయాలపాలు కాగా అందరిని 108 వాహనంలో నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. వినయ్ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మరణించాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

తిరుపతిలో జిల్లావాసి గుండెపోటుతో మృతి



చాడేకర్ రూపమ్(ఫైల్)

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రానికి చెందిన చాడేకర్ రూపమ్(31) తిరుపతిలో గురువారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు..రెండు రోజుల క్రితం రూపమ్ అతడి స్నేహితులు కారులో తిరుపతికి బయలుదేరారు. తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లి దర్శనం టికెట్ కోసం క్యూ లైన్‌లో ఉన్న రూపమ్ అర్ధరాత్రి ఒక పక్క ఛాతీ నొస్తుందంటూ ఒక్కసారిగా కుప్పకూలాడని ఆయన వెంట ఉన్న స్నేహితులు తెలిపారు. వెంటనే టీటీడీ సిబ్బంది అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించినప్పటికి రూపమ్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం రూపమ్ మృతదేహాన్ని తిరుపతి నుంచి మద్నూర్‌కు అంబులెన్స్‌లో తీసుకొచ్చారు. సాయంత్రం మద్నూర్‌లో రూపమ్ అంత్యక్రియలు నిర్వహించారు. 3 నెలల కిందట రూపమ్ వివాహం జరిగింది. అంతలోనే గుండెపోటుతో మృతి చెందడం ప్రతి ఒక్కరిని కలచివేసింది. రూపమ్ అకాల మృతితో మద్నూర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

'పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడు'



వినతి పత్రం అందిస్తున్న లగ్నేశ్వరి

బోధన్: తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి రెండేళ్ల పాటు సహజీవనం చేసి పాప పుట్టిన తర్వాత ఇదే గ్రామానికి చెందిన సతీష్ మోసం చేశాడని వర్ని మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన మహిళ లగ్నేశ్వరి ఆరోపించారు. న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం బోధన్ ఆర్డీవో ఆఫీసు ఎదుట నిరసన తెలిపి అధికారికి వినతి పత్రం అందించారు. తనకు నాలుగు నెలల పాప ఉందని, సతీష్ ఆయన కుటుంబ సభ్యులు తన కుటుంబ సభ్యులపై దాడులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. పలుమార్లు అధికారుల వద్దకు వెళ్లినా పట్టించుకోవడం లేదని తెలిపారు. తగు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య

రెంజల్(బోధన్): దూపల్లి గ్రామానికి చెందిన ఆకుల మహేశ్(29) అనే యువకుడు స్థానిక చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. వివరాలు.. గత రెండు సంవత్సరాలుగా మహేశ్ తీవ్ర కడుపునొప్పితో బాధపడుతూ మద్యానికి బానిసైనట్లు తండ్రి అందించిన ఫిర్యాదులో పేర్కొన్నారు. గురువారం ఇంటి నుంచి వెళ్లిన కుమారుడు రాత్రి అయినా ఇంటికి రాలేదని, శుక్రవారం స్థానిక చెరువులో మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు సమాచారం అందించడంతో వెళ్లి చూడగా తమ కుమారుడిదని నిర్ధారించుకున్నట్లు తండ్రి సాయిలు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్‌లోని జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై చెప్పారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



సీపీకి గౌరవ వందనం చేస్తున్న స్థానిక పోలీసులు

వేల్పూర్: వేల్పూర్ పోలీ స్‌స్టేషన్‌ను జిల్లా సీపీ కల్మేశ్వర్ శుక్రవారం తనిఖీ చేశారు.వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న ఆయనకు స్థానిక పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం ఆయన స్టేషన్ ఆవరణను,రికార్డులు పరిశీలించారు. ఎస్సై వినయ్‌కుమార్, సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఐపీఎస్‌లు శేషాద్రిరెడ్డి, చైతన్యరెడ్డి,ఏసీపీ బస్వారెడ్డి,ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



బ్రాహ్మణపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఎడపల్లి(బోధన్): అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న మరమ్మతు పనులను నాణ్యతతో చేపట్టాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. శుక్రవారం బ్రాహ్మణపల్లి, ఏఆర్పీ క్యాంప్ గ్రామాల ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. కొద్దిపాటి మరమ్మతులు చేస్తే పూర్తయ్యావాటిని పూర్తిగా తొలగించి చేపట్టడం సరికాదన్నారు. ప్రభుత్వ నిధులను వృథా చేయకూడదన్నారు. ఇంజనీరింగ్ అధికారులు అధిక మొత్తంలో అంచనాలను రూపొందించడం సరికాదన్నారు. ఆయన వెంట డీఈవో దుర్గాప్రసాద్, బోధన్ ఆర్డీవో, ఎంపీడీవో శ్రీనివాస్, స్థానిక నాయకులు ప్రమీల, సాయిలు, సయ్యద్ ఉన్నారు.

ముగ్గురు విద్యార్థులు డిబార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో శుక్రవారం 1,228 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. నిజామాబాద్‌లోని నిశిత కామర్స్ డిగ్రీ కాలేజ్, గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, సీఎస్ఐ డిగ్రీ కాలేజ్ పరీక్షా కేంద్రాల్లో ఒక్కొక్కరి చొప్పున ముగ్గురు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ డిబార్ అయినట్లు ఆయన తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ 4వ సెమిస్టర్ రెగ్యులర్, 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 8,400 మంది విద్యార్థులకు గానూ 7,840 మంది, మధ్యాహ్నం జరిగిన 2వ సెమిస్టర్ రెగ్యులర్, 3వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 8,709 మంది విద్యార్థులకు గానూ 8,038 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్, జాయింట్ డైరెక్టర్ అతిక్ సుల్తాన్ ఉమ్మడి జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు.



నిజామాబాద్‌లోని డిగ్రీ పరీక్షా కేంద్రాన్ని, తనిఖీ చేస్తున్న తెయూ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్

బీర్లలో చెత్తా చెదారం

- బార్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేసిన కస్టమర్లు



చెత్తను చూపిస్తున్న కస్టమర్

ఎల్లారెడ్డి: రెస్టారెంట్‌లలో కస్టమర్లకు పాడైపోయిన వస్తువులతో తయారు చేసిన ఆహారం అందిస్తున్న ఘటనలు వెలుగు చూస్తున్న సమయంలో బార్‌లలో విక్రయిస్తున్న బీర్లలో సైతం చెత్తా చెదారం రావడంతో మద్యం ప్రియులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని సంగీత బార్ అండ్ రెస్టారెంట్‌లో అన్నాసాగర్ గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి, కాశీరాంలు బీరు తాగేందుకు రాగా బీర్‌లో చెత్త చెదారం కనిపించడంతో బార్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత లేని బీర్లను విక్రయించడంతోనే ఇలాంటి ఘటన చోటు చేసుకుంటున్నదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈవిషయమై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎక్సైజ్ అధికారులు స్పందించి బార్ నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకోవాలని ఇకపై ఇలాంటి బీర్లు అమ్మకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈవిషయమై బార్ నిర్వాహకులను వివరణ కోరగా.. బీర్‌లో చెత్త వచ్చిన విషయం వాస్తవమేనని తెలిపారు. చెత్త వచ్చిన బీర్లను తిరిగి కంపెనీకి పంపినట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



నాగేంద్ర(ఫైల్)

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రానికి చెందిన ఆప్కా నాగేంద్ర(18) అనే యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. వివరాలు.. రెండు రోజుల క్రితం మెండోరా మండలం బుస్సాపూర్ శివారులో జాతీయ రహదారి–44 పై కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో నాగేంద్ర తీవ్ర గాయాలపాలయ్యాడు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి విషమించి శుక్రవారం మృత్యువాత పడ్డాడు. కారు ప్రమాదంలో గాయపడిన మరో వ్యక్తి అభిరాం ఆరోగ్యం నిలకడగా ఉందని స్థానికులు తెలిపారు.

పురుగుల మందు తాగిన మహిళ..

ఖలీల్‌వాడి: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన నాగారంలోని 300 క్వార్టర్స్‌కు చెందిన నాగలక్ష్మి(38) అనే మహిళ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందినట్లు ఐదవ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై అశోక్ తెలిపారు. గత ఆదివారం కుటుంబ కలహాలతో నాగలక్ష్మి పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్యతో గొడవపడిన వ్యక్తి..

బీబీపేట: ఫిట్స్ మందులు అతిగా తీసుకొని 3 రోజుల క్రితం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మెట్టు స్వామి(37) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాలు.. మెట్టు స్వామి(37)కి రాజంపేటకు చెందిన నవ్యతో వివాహం కావడంతో భార్యతో కలిసి రాజంపేటలోనే నివాసం ఉంటున్నాడు. భార్యభర్తల మధ్య గొడవలు జరగడంతో ఈ నెల 28న బీబీపేటలోని తన సొంత ఇంటికి వచ్చాడు. 29న గ్రామంలోని విజయ డైరీ వద్ద పడిపోయి ఉండడాన్ని గమనించి స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఫిట్స్ మందులు ఎక్కువగా తీసుకున్నట్లు వైద్యులు తెలిపారు. 2 రోజులు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని ఎస్సై తెలిపారు. కొన్నేళ్లుగా ఫిట్స్ వస్తుంటాయని, దానికి తోడు భార్యతో గొడవల కారణంగా జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.